సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం ׀ 10 ׀ సెప్టెంబర్ ׀ 2025



చీనీ టన్ను రూ.17,500

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17,500, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.17

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.17, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,750 టన్నుల టమాట వచ్చింది.



జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: రాగల ఐదు రోజులూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం బులెటిన్ విడుదల చేశారు. ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు మోస్తరు వర్షం కురిసే సూచన ఉందన్నారు. 10న ఒక మి.మీ, 11న 15 మి.మీ, 12న 8 మి.మీ, 13న 15 మి.మీ, 14న 13 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 33.7 డిగ్రీల నుంచి 34.1 డిగ్రీల మధ్య నమోదు కావొచ్చన్నారు. పశ్చిమ దిశగా గంటకు 13 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలి వీచే అవకాశం ఉందని వెల్లడించారు.

నేడు పాఠశాలలకు సెలవు

- రెండో శనివారం 13న పాఠశాలలు పనిచేయాలంటూ ఆదేశం
- ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయుల తీవ్ర ఆగ్రహం

పుట్టపర్తి అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లా పర్యటన నేపథ్యంలో బుధవారం జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు పాల్గొనే 'సూపర్ సిక్స్–సూపర్ హిట్' కార్యక్రమానికి పాఠశాలల బస్సులు తరలించిన నేపథ్యంలో ప్రైవేటుతో పాటు ప్రభుత్వ పాఠశాలలకూ సెలవు ప్రకటించినట్లు తెలుస్తోంది. నేటి సెలవుకు బదులుగా రెండో శనివారం (ఈనెల 13న) అన్ని యాజమన్యాల పాఠశాలలు పని చేయాల్సి ఉంటుందని డీఈఓ స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇచ్చిన సెలవుకు రెండో శనివారం పని చేయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయులు రెండో శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవలు వస్తాయని ముందుగానే వారి ప్రోగ్రాంలు నిర్ణయించుకుని, ప్రయాణాలకు టికెట్లు రిజర్వేషన్లు చేయించుకొని సిద్ధంగా ఉంటారన్నారు. అలాంటి ఉన్నట్టుండి శనివారం పనిదినంగా ప్రకటించడంపై ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రచారం కోసం సభ ఏర్పాటు చేస్తే ప్రయాణ భద్రత రీత్యా పాఠశాలలకు సెలవు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సెలవుకు పరిహారంగా మరో రోజును ప్రకటించాలని, రెండో శనివారం కచ్చితంగా సెలవు మంజూరు చేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

మాతాశిశు మరణాలను తగ్గించాలి : డీఎంహెచ్‌ఓ



వైద్యులతో మాట్లాడుతున్న ఫైరోజా బేగం

హిందూపురం టౌన్: మాతాశిశు మరణాల శాతాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని వైద్యాధికారులకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజా బేగం సూచించారు. మంగళవారం హిందూపురంలోని జిల్లా ఆస్పత్రిలో హిందూపురం ప్రాంత వైద్యాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రాథమిక, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఓపీ, ఐపీలను పెంచాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. హెల్త్ సెంటర్లలో కుక్క కాటుకు, పాము కాటుకు టీకాలను అందుబాటులో ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని ఆమె ఆదేశించారు.

రైతన్న ధర్మాగ్రహం



వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులతో కలిసి పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులతో కలిసి ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

యూరియా కొరతపై రైతన్న కదం తొక్కాడు. దేశానికే అన్నంపెట్టే తమను తిప్పలు పెడుతున్న సర్కారు తీరును నిరసిస్తూ గొంతెత్తి నినదించాడు. యూరియా కొరతతో పాటు రైతు సంక్షేమాన్ని విస్మరించిన కూటమి సర్కారు కళ్లు తెరిపించేందుకు మంగళవారం వైఎస్సార్‌సీపీ 'అన్నదాత పోరు' సాగించగా..రైతులు భారీగా తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి పెనుకొండ, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని సర్కారు తీరును ఎండగట్టారు.



వైఎస్సార్ సీపీ శ్రేణులు, అన్నదాతలతో కలిసి పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉషశ్రీచరణ్, చిత్రంలో టీఎన్ దీపిక తదితరులు

యూరియా కోసం కదం తొక్కిన అన్నదాత

- ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండలో భారీ ర్యాలీ
- జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన కర్షకులు
- ఆర్డీఓ కార్యాలయాల ముట్టడి.. ఆందోళన
- యూరియా అందజేయాలని వినతిపత్రాల అందజేత
- పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరంలో పోలీసుల ఓవరాక్షన్
- పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను బెదిరించిన ఖాకీలు

సాక్షి, పుట్టపర్తి: రైతులకు సరిపడా ఎరువులు సకాలంలో అందజేయాలనే డిమాండ్‌తో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'అన్నదాత పోరు' జిల్లాలో విజయవంతమైంది. వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు రైతులు, రైతు సంఘాల నాయకులు భారీగా తరలి రావడంతో ఆయా పట్టణాల్లో నిర్వహించిన ర్యాలీల్లో జన ప్రవాహం కనిపించింది. సర్కారు తీరును నిరసిస్తూ రైతులు చేసిన నినాదాలతో ఆయా పట్టణాలు ప్రతిధ్వనించాయి.

అడుగడుగునా ఆంక్షలు

కూటమి పార్టీల నాయకుల ఒత్తిళ్లతో 'అన్నదాత పోరు'ను అడ్డుకునేందుకు పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. మరో మూడేళ్ల పాటు కూటమి ప్రభుత్వం ఉంటుందని.. నిబంధనలు ఉల్లంఘిస్తే ఇబ్బందులు పడతారని పోలీసులు హెచ్చరించారు. అయినా రైతుల కోసం ఎందాకైనా అంటూ.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు, రైతులు వేలాదిగా స్వచ్ఛందంగా తరలివచ్చి 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జిల్లాలో పుట్టపర్తి, పెనుకొండ, కదిరి, ధర్మవరంలో అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రైతులు భారీగా తరలివచ్చారు. అక్కడి నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయాలకు బయలుదేరారు. అయితే పార్టీ కార్యాలయాల వద్దనే పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత ప్రధాన కూడళ్లలో వెనక్కి పంపించేయత్నం చేశారు. కార్యక్రమానికి అనుమతులు లేవంటూ.. సోమవారం రాత్రి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలకు పోలీసులు నోటీసులు పంపించారు. అయినా ఆంక్షలను దాటుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పెనుకొండలో జన ప్రభంజనం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో పెనుకొండలో చేపట్టిన 'అన్నదాత పోరు'కు హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, మడకశిర సమన్వయకర్త ఈర లక్కప్పతో పాటు వేలాది మంది రైతులు, కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యారు. మడకశిర రోడ్డులో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డులోని ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ సాగింది. రైతుకూ అదనపు భారం పడకుండా నిర్ణయించిన ధరలకే ఎరువులు అందజేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం చేరుకుని బైఠాయించారు. యూరియా సక్రమంగా అందజేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

పుట్టపర్తిలో పోలీసుల బెదిరింపులు

జిల్లా కేంద్రం పుట్టపర్తిలో 'అన్నదాత పోరు'లో పాల్గొనేందుకు వస్తున్న కార్యకర్తలు, రైతులను ఎనుములపల్లి జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. మరో మూడేళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుందని.. అనవసరంగా కేసులలో ఇరుక్కుంటారని.. వెనక్కి వెళ్లాలని హెచ్చరించారు. అయితే వైఎస్సార్ సీపీ శ్రేణులు 'మా పార్టీ కార్యాలయం' చేరుకుంటే మీకేం (పోలీసులకు) నష్టం అంటూ వాగ్వాదం చేయడంతో వదిలేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి గణేశ్ సర్కిల్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. గణేశ్ సర్కిల్‌లో బారికేడ్లు అడ్డుపెట్టి.. పోలీసులు పలు ఆంక్షలు విధించినా ముందుకే సాగారు. అనంతరం ఆర్డీఓ సువర్ణకు వినతిపత్రం సమర్పించారు.

జనాలతో దద్దరిల్లిన ధర్మవరం

'అన్నదాత పోరు' కార్యక్రమంతో ధర్మవరం దద్దరిల్లింది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరారు. అయితే పోలీసులు భారీ ర్యాలీ కుదరదని.. నినాదాలు చేయరాదని.. ప్రధాన మార్గం గుండా కూడలి వరకు వెళ్లేందుకు అనుమతులు లేవంటూ కట్టడి చేయబోయారు. అయినప్పటికీ నాయకులంతా రైతు గోస అందరికీ తెలియాలంటూ స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఎస్‌బీఐ కాలనీ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పీఆర్టీ సర్కిల్ మీదుగా వెళ్లాలని నిర్ణయించినప్పటికీ పోలీసులు అనుమతించలేదు. దీంతో ఆర్డీఓ కార్యాలయం వద్ద నాయకులు బైఠాయించారు. పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం రైతులకు సరిపడా ఎరువులు అందజేయాలని ఆర్డీఓ మహేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

కదిరిలో కదం తొక్కిన కర్షకులు

'అన్నదాత పోరు'కు కదిరి పట్టణంలో కర్షకులు కదం తొక్కారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది రైతులు, ప్రజలు, కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేశారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్, వేమారెడ్డి సర్కిల్, టవర్ క్లాక్, కోనేరు సర్కిల్ మీదుగా ఆర్డీఓ ఆఫీసు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. హిందూపురం పార్లమెంటు పరిశీలకుడు రమేశ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, కేవీ ప్రణీత్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మకు అందజేశారు.

బాబూ..అమరావతి జపం మానుకో



సీఎం చంద్రబాబుకు అమరావతి తప్ప.. రాష్ట్రంలోని సమస్యలు పట్టడం లేదు. ఇప్పటికైనా అమరావతి జపం మానుకో బాబు. రైతుల గురించి ఆలోచించు. నాలుగుసార్లు సీఎంనని చెప్పుకోవడం కాదు..చేతల్లో ఆ అనుభవం చూపాలి. రైతులు యూరియా కోసం క్యూ కడుతున్నారంటే ఇంతకంటే దుర్మార్గ పాలన ఉండదు. రైతు లేకపోతే మనం లేమన్న విషయం గుర్తించి అన్నదాతలకు అండగా నిలబడు. రైతును మోసగించిన ఏ ప్రభుత్వమూ మనలేదని గుర్తుంచుకో.

– రమేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు

రైతు కన్నీరు రాష్ట్రానికి అరిష్టం



ప్రభుత్వ సాయం అందకపోయినా రైతులు ప్రకృతికి ఎదురొడ్డి వ్యవసాయం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో రైతులకు వీలైతే మేలు చేయాలిగానీ కీడు చేయకూడదు. కానీ రాష్ట్రంలోని కూటమి సర్కార్ రైతును ఏడిపిస్తోంది. విత్తనాలు, ఎరువులు ఇవ్వకుండా వేధిస్తోంది. రైతు కన్నీరు రాష్ట్రానికి మంచికాదన్న విషయం పాలకులు గుర్తించాలి. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని రైతుకు అండగా నిలవాలి.

–బీఎస్ మక్బూల్, వైఎస్సార్ సీపీ కదిరి సమన్వయకర్త

రైతులంటే అంత అలుసా?



పంట వేద్దామంటే విత్తనాలు, ఎరువులు ఇవ్వరు. ఎలాగోలా కష్టపడి పంట పండిస్తే గిట్టుబాటు ధర కల్పించరు. కూటమి సర్కారుకు రైతు సంక్షేమం పట్టడం లేదు. ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వమే. రైతులు యూరియా కోసం బారులు తీరితే భోజనం కోసం నిలబడ్డారంటూ మంత్రి అచ్చెన్నాయుడు హేళనగా మాట్లాడారు. రైతు కష్టం తెలియని ఆయన వ్యవసాయశాఖ మంత్రిగా పనికిరారు. వెంటనే పదవికి రాజీనామా చేయాలి. రైతుల సమస్యను ప్రభుత్వానికి తెలియజెప్పేందుకే వైఎస్సార్ సీపీ 'అన్నదాత పోరు' నిర్వహించింది. విజయవంతం చేసిన కార్యకర్తలకు, రైతులకు ధన్యవాదాలు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు

సంక్షోభంలో వ్యవసాయం



కూటమి పాలనలో వ్యవసాయం సంక్షోభంలోకి పడింది. ప్రభుత్వ సాయం కరువై రైతన్నలు ఆత్మహత్యలకు తెగిస్తున్నారు. చివరకు యూరియా కూడా పంపిణీ చేయకపోవడంతో రైతులు బారులు తీరిన దుర్భర పరిస్థితులు దాపురించాయి. దీనికి సిగ్గుపడాల్సిన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు బఫేల వద్ద భోజనాల కోసం నిలబడ్డారంటూ రైతులను అవమానించారు. నిజంగా ఇది సిగ్గుచేటు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్‌బీకేల ద్వారా ఎప్పటికప్పుడు యూరియా, ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచిన జగనన్న.. రైతాంగానికి దన్నుగా నిలిచారు. ఇప్పటికైనా ఈ పాలకులు రైతుకు అండగా నిలబడాలి.

– కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ ధర్మవరం సమన్వయకర్త

చేతగాకపోతే దిగిపోండి



కూటమి సర్కారు ఏడాదిన్నర పాలనలో ఏ వర్గానికీ న్యాయం చేయలేకపోయింది. కనీసం రైతులకు యూరియా కూడా ఇవ్వలేకపోవడం దుర్మార్గం. ఉచిత విద్యుత్ కోసం ధర్నా చేసిన రైతులపై గుర్రాలతో తొక్కించిన చంద్రబాబు.. ఇప్పటికీ అదే పంథాలో పాలన సాగిస్తున్నారు. ఏసీ రూముల్లో సమీక్షలు చేస్తూ తాను అనుభవజ్ఞుడినని గొప్పలు చెబుతున్నారు. అసలు రాష్ట్రంలో ఎంత విస్తీర్ణంలో పంటలు వేశారు. ఎంత మేర ఎరువులు కావాలో కూడా తెలియకుండా పాలన సాగిస్తున్నారా...? మీకు ఓటు వేసిన పాపానికి రైతులు రోడ్లెక్కాలా...? పాలన చేతగాకపోతే దిగిపోండి.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పుట్టపర్తి సమన్వయకర్త

అన్నదాతల గోడు పట్టదా?



ఖరీఫ్ ఆరంభం నుంచి రైతులు విత్తనాలు, ఎరువుల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అయినా పాలకులకు పట్టడం లేదు. కనీసం యూరియా కూడా ఇవ్వకపోతే పంటలు ఎలా సాగుచేస్తారు. వ్యవసాయం దండగ అని చెప్పిన చంద్రబాబు...అందుకు తగ్గట్టుగానే పాలన సాగిస్తున్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని దేశానికే అన్నంపెట్టే రైతన్నకు చేయూత ఇవ్వాలి. లేకపోతే ఆయన్ను చరిత్ర క్షమించదు.

– దీపిక, వైఎస్సార్ సీపీ హిందూపురం సమన్వయకర్త

ఏం సాధించారని సభలు



రాష్ట్రంలోని రైతులంతా యూరియా కోసం రోడ్లపై ఉంటే ఈ ప్రభుత్వం మాత్రం ఏదో సాధించినట్లు 'సూపర్ హిట్' అంటూ హడావుడి చేస్తోంది. ఏడాదిన్నర పాలనలో ఏ వర్గానికి న్యాయం చేశారో చెప్పాలి. అసలు హామీలే నెరవేర్చని కూటమి పెద్దలు ఇలా సభల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేయడం దుర్మార్గం. రైతు సంక్షేమం పట్టని ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదు.

– ఈరలక్కప్ప, వైఎస్సార్ సీపీ మడకశిర సమన్వయకర్త



పార్టీ నేతలతో కలిసి కదిరిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్ మక్బూల్, చిత్రంలో పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా తదితరులు



పుట్టపర్తిలో 'అన్నదాత పోరు' కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న పార్టీ నాయకులు, రైతులను అడ్డుకుని వెనక్కు పంపుతున్న పోలీసులు

కావాల్సింది కొండంత.. సరఫరా గోరంత

- యూరియా కోసం రైతులకు తప్పని అగచాట్లు
- పీఏసీఎస్ ఎదుట బారులు తీరిన వైనం
- కూటమి సర్కారు తీరుపై తీవ్ర అసంతృప్తి



యూరియా కోసం మడకశిర పీఏసీఎస్ వద్దకు తరలి వచ్చిన రైతులు

మడకశిర: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. అదనులో ఎరువు వేయకపోతే పంట దక్కే పరిస్థితి లేకపోవడంతో రైతులు యూరియా కోసం పీఏసీఎస్‌ల ఎదుట బారులు తీరుతున్నారు. ముఖ్యంగా కర్ణాటక సరిహద్దున ఉన్న మడకశిర నియోజకవర్గంలో యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది. మంగళవారం మడకశిర పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ) 150 బస్తాల యూరియా సరఫరా కాగా, వందలాది మంది రైతులు తరలి వచ్చారు. క్యూలో నిలబడి గంటల తరబడి బారులు తీరగా.. అధికారులు తొలుత రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. ఆ తర్వాత స్టాకు తక్కువగా ఉండటంతో రైతుకు బస్తా చొప్పున పంపిణీ చేయాల్సి వచ్చింది. అయినా కూడా చాలా మంది రైతులకు యూరియా అందకపోవడంతో వారంతా సర్కారు తీరుపై మండిపడ్డారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. డిమాండ్ మేరకు యూరియాను కూడా అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు.



యూరియా కోసం కౌంటర్ వద్ద గుమిగూడిన రైతులు

కర్ణాటకలో కొనుగోలు

డిమాండ్ మేరకు సర్కారు యూరియాను అందించకపోవడంతో నియోజకవర్గంలోని పలువురు రైతులు కర్ణాటకలోని ధర్మపురం, మంగళవాడ, బరగూరు, శిర, మదలూరు, మిడిగేశి, పావగడ తదితర ప్రాంతాలకు వెళ్లి యూరియాను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లు గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాల్లోనే యూరియా, కాంప్లెక్స్, డీఏపీ తదితర ఎరువులు, విత్తనాలు అందేవని, ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

క్లుప్తంగా

పట్టు చీరలో ప్రతిబింబించిన క్రీడాభిమానం



ఆర్‌సీబీ క్రీడాకారులతో నేసిన పట్టు చీరను చూపుతున్న చేనేత కార్మికుడు పురుషోత్తం

పావగడ: ఇటీవల టీ 20 క్రికెట్ పోటీల్లో విజయం సాధించిన ఆర్‌సీబీ జట్టుపై తనకున్న అభిమాన్ని ఓ చేనేత కార్మికుడు పురుషోత్తం ప్రత్యేకంగా చాటుకున్నారు. పావగడ తాలూకా వైఎన్ హొసకోట గ్రామానికి చెందిన పురుషోత్తం.. ఆర్‌సీబీ జట్టు లెజెండ్ విరాట్ కోహ్లితో పాటు ఇతర క్రీడాకారుల చిత్రాలను పట్టుచీరలో పొందుపరిచి క్రికెట్ అభిమానులకు కానుకగా అందించారు. ఈ చీరను మంగళవారం ఆయన ప్రదర్శించి, పలువురిని ఆకట్టుకున్నారు.

జిల్లాకు 800 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అగ్రికల్చర్: ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) కంపెనీ నుంచి 800 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. మంగళవారం ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన యూరియా బస్తాలను ఆయన పరిశీలించారు. ఇండెంట్ల మేరకు ఉమ్మడి జిల్లాకు సంబంధించి మార్క్‌ఫెడ్‌కు 560 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 240 మెట్రిక్ టన్నులు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యకరమైన అలవాట్లతో జీవించాలి

- ఎయిడ్స్ నియంత్రణ అధికారి సునీల్



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

హిందూపురం టౌన్: ఆరోగ్యకమైన అలవాట్లతో జీవనం సాగించాలని, ముఖ్యంగా యువత హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనతో మెలగాలని జిల్లా లెప్రసి, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సునీల్ అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు హిందూపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన 5 కిలోమీటర్ల మారథాన్ రెడ్ రన్‌ను మున్సిపల్ చైర్మన్ రమేష్ జెండా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. యువత క్రమశిక్షణ కలిగి ఉండి, సామాజిక బాధ్యతతో మెలగాలని కోరారు. అనంతరం మారథాన్‌లో మొదటి స్థానం సాధించిన ఎస్‌డీజీఎస్ డిగ్రీ కళాశాలలో బీకాం విద్యార్థి జి. శ్రీనివాసబాబు, ఎస్ఎస్‌పీఆర్ మహిళా డిగ్రీ కళాశాల బీకాం కంప్యూటర్స్ విద్యార్థిని బి.రాధిక, రెండో స్థానం సాధించిన పుట్టపర్తిలోని మంగళకర డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థి కె.జయచంద్ర, ఎస్ఎస్‌పీఆర్ మహిళా డిగ్రీ కళాశాల బీకాం కంప్యూటర్స్ విద్యార్థిని యు.పల్లవికి నగదు పురస్కారాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డీఎస్‌డీఓ ఉదయ భాస్కర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా సెక్రటరీ రామకృష్ణ, పీడీ లోక్‌నాథ్, ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి, క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ రమణ తదితరులు పాల్గొన్నారు.





అనంతపురంలో వైన్‌షాపు ముందు తప్పతాగి రోడ్డుపై పడుకున్న మందుబాబు



మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి వీల్లేకుండా 'అంతర్రాష్ట్ర సర్వీసు' బోర్డు పెట్టిన దృశ్యం



ఇటీవల ధర్మవరం రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి సేవిస్తున్న యువకులు

సూపర్ వంచన

- తొలి ఏడాదిలో ఒక్క పథకానికీ పైసా ఇవ్వని బాబు సర్కారు
- ప్రజా ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల అరకొరగా కొన్ని పథకాల అమలు
- అందులోనూ రెండు పథకాలు మొదలే పెట్టని వైనం
- కొందరికే సిలిండర్లు ఇచ్చి అందరికీ ఇచ్చామంటూ గొప్పలు
- 'తల్లికి వందనం' ఎంతమందికిచ్చారో చెప్పకుండా కుప్పిగంతలు
- బస్సులు తగ్గించడంతో నరకంగా మారిన ఉచిత ప్రయాణం
- ఊసే లేని 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1,500 పథకం
- అటకెక్కిన 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- అయినా 'సూపర్' హిట్ అంటూ సభ ఏర్పాట్లపై జనం ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలతో నమ్మించి లక్షలాది మంది సామాన్యులను, పేదలను మోసం చేసిన కూటమి సర్కారు..అన్నీ ఇచ్చేశామని, సూపర్‌సిక్స్ హామీలు సూపర్ హిట్ అయ్యాయని సభలు జరపడంపై సామాన్యులు నవ్వుకుంటున్నారు. చంద్రబాబు పేరు చెబితే ఏ పథకమూ సంపూర్ణంగా ఉండదు.. ఇదీ అంతే అంటున్నారు. తొలి ఏడాది సూపర్‌సిక్స్ పథకాల్లో దేనికీ పైసా ఇవ్వకుండా మభ్యపెట్టిన సర్కారు.. రెండో ఏడాది ప్రతిపక్షాల ఒత్తిడి, సామాన్యుల్లో ఆగ్రహజ్వాలలు తట్టుకోలేక అరకొర నిధులిచ్చి చేతులు దులుపుకుంది. దీనికిప్పుడు సూపర్‌హిట్ సభ అంటూ ప్రచారం చేయడం చంద్రబాబుకే చెల్లిందని జనంలో చర్చ జరుగుతోంది.

తల్లికి వందనం ఎంతమందికి?

తల్లికి వందనం తొలి ఏడాదికి డుమ్మా కొట్టారు. రెండో ఏడాదైనా అందరికీ ఇచ్చారా అంటే అదీ లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకూ 6.20 లక్షల మంది ఉన్నారు. వీళ్లలో ఎంతమందికి తల్లికి వందనం సొమ్ము పడిందో కలెక్టర్ల నుంచి డీఈఓల వరకూ ఎవరి దగ్గరా వివరాలు లేవు. దీనిపై కలెక్టర్లకు ఫిర్యాదులు వెల్లువెత్తుతుండగా డీఈఓకు పంపిస్తున్నారు. అక్కడికెళితే గ్రామ/వార్డు సచివాలయానికి పంపిస్తున్నారు. ఇదీ దుస్థితి.

మహిళలకు రూ.1500 ఊసే లేదు

సూపర్‌సిక్స్‌లో ప్రధాన హామీ 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారు. 59 ఏళ్ల వరకూ అలా ఇస్తామన్నారు. కానీ ఇప్పటివరకూ ఏ ఒక్క మహిళకూ నయాపైసా ఇవ్వలేదు. ఉమ్మడి జిల్లా జనాభా 44 లక్షలు కాగా 18 నుంచి 59 ఏళ్లలోపు మహిళలు 15 లక్షల మంది ఉన్నారు. వీళ్లలో ఇప్పటివరకూ ఏ ఒక్కరికీ రూపాయి రాలేదు.

అన్నదాతకు రూ.5 వేలే..

ఎలాంటి షరతులు లేకుండా ప్రతిరైతుకు ఏడాదికి రూ.20 వేలు సాయం చేస్తామన్నారు. తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టి.. రెండో ఏడాది పీఎం కిసాన్ కింద రూ.2 వేలు అందితే కూటమి సర్కారు కేవలం రూ.5 వేలు ఇచ్చింది. ఇందులోనూ చాలామందికి పడలేదు. ఈ ఏడాది మరో మూడు వాయిదాలు చెల్లించాల్సి ఉంది. అది ఇస్తారో లేదో తెలియని పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో 5.60 లక్షల మంది రైతులు ఉన్నారు. వీళ్లకు ఏడాదిన్నరలో రూ.5 వేలు ఇచ్చి సూపర్‌హిట్ అంటున్నారు.

ఊరికో ఉద్యోగమూ లేదు..

'20 లక్షల ఉద్యోగాలు.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం లేదంటే నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి' అంటూ గొప్పగా చెప్పారు. ఎంటెక్, బీటెక్, డిగ్రీ, డిప్లొమా ఇలా కోర్సులు పూర్తయి నిరుద్యోగంతో అల్లాడి పోతున్నవారు ఉమ్మడి జిల్లాలో 7 లక్షల మందికి పైగా ఉన్నారు. వీళ్లలో ఇప్పటివరకూ ఎవరికీ నెలకు రూ.3వేలు కాదు కదా ముప్పై రూపాయలు కూడా ఇవ్వలేదు. కానీ నేడు జరిగే విజయోత్సవ సభలో ఇది హిట్ జాబితాలో ఉంది.

ఉచితం అని బస్సులు తగ్గించారు...

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మహిళలకు ఇచ్చిన ఉచిత ఆర్టీసీ ప్రయాణం నరకప్రాయంగా ఉంది. ఉచితం అన్నారు, బస్సులు భారీగా తగ్గించారు. ఉదాహరణకు అనంతపురం నుంచి కడపకు ప్రతి 30 నిముషాలకు ఒక బస్సు ఉండేది. ఇప్పుడు గంటకొకటి కూడా లేదు. అలాగే హిందూపురం నుంచి కొడికొండ వరకూ ప్రతి 20 నిముషాలకు బస్సుండేది. ఇప్పుడు 40 నిముషాలైనా లేదు. దీంతో డబ్బు పెట్టి పోదామన్నా బస్సులేక నరకం అనుభవిస్తున్నారు.

మూడు సిలిండర్లు ఎక్కడ?

ఏడాదికి మూడు ఉచిత సిలీండర్లు అని చెప్పారు కానీ ఎక్కడ ఇస్తున్నారు, ఎవరికి ఇస్తున్నారో తెలియని పరిస్థితి. రమారమి 12 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉంటే ఎంతమందికి ఉచిత సిలిండర్లు ఇచ్చారో ప్రభుత్వం లెక్కలతో చెప్పలేకపోతున్నది. దురదృష్టవశాత్తు ఇదికూడా 'హిట్' కొట్టింది.

సూపర్ సిక్స్ అమలు కాకపోగా..

- కొత్త మద్యం పాలసీ పేరుతో ఊరూరా బెల్టు షాపులు, పర్మిట్ రూములతో ఉమ్మడి అనంత జిల్లాను మత్తులో జోగేలా చేశారు.
- హిందూపురంలో బాలకృష్ణ పీఏల అండ చూసుకుని ఇసుక మాఫియా రెచ్చిపోతోంది.
- ఫ్యాక్షన్ హత్యలు మళ్లీ పురుడుపోసుకున్నాయి. రామగిరి మండలంలో లింగమయ్యను, రాప్తాడులో నారాయణరెడ్డి, ముత్యాలమ్మను టీడీపీ నేతలు దారుణంగా హత్య చేశారు.
- అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో కొండలు, గుట్టలు పిండిచేసి సహజ వనరులను 'పచ్చ' నేతలు లూటీ చేశారు.
- చిత్రావతి, పెన్నా, వేదవతి హగరి నదుల్లో ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నా పట్టించుకునే దిక్కు లేదు.
- అనంతపురం అర్బన్‌లో ఎవరైనా ఇళ్లు కట్టాలంటే ఎమ్మెల్యేకు ప్రత్యేక ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి.
- తాడిపత్రి, ధర్మవరం, కదిరి, అనంతపురం... మట్కా, గంజాయిలకు అడ్డాగా మారాయి.
- గుత్తిలో ఓ వ్యక్తిని టీడీపీ నేతలు రైలు పట్టాలపై పడుకోబెట్టి బెదిరించి డబ్బు దండుకున్నారు.
- రాప్తాడులో వెంచర్లు, పరిశ్రమలు స్థాపిస్తే చాలు వారినుంచి ముక్కుపిండి సుంకం వసూలు చేస్తుండటంతో ఇక్కడకు రావడానికే భయపడుతున్నారు.

ఒక్క సిలిండరూ ఇవ్వలేదు



కూటమి ప్రభుత్వం వస్తే ప్రతి ఏడాది మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. మేం ఇంత వరకు మూడు గ్యాస్ సిలిండర్లనూ డబ్బులు పెట్టి తీసుకున్నాం. ప్రభుత్వం నుంచి మాత్రం ఒక్క సిలిండర్‌కూ సబ్సిడీ డబ్బు మాకు అందలేదు.

– ఆదిలక్ష్మి, బూదేడు గ్రామం, గార్లదిన్నె మండలం

ప్రయాణం నరకంగా మారింది



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితమంటున్నా ఆ మేరకు సౌకర్యాలు కల్పించక పోవడంతో నరకంగా మారింది. పథకం ప్రారంభించాక బస్సుల్లో మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. అందుకు తగ్గట్టు బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో గొడవలు చోటు చేసుకుంటున్నాయి.

– రేవతి, గృహిణి, తాడిపత్రి

హామీ ఎందుకు ఇచ్చారు?



ఆడబిడ్డ నిధి పథకం అమలు అయితే నా చదువులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావించా. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటి వరకూ అమలు చేయలేదు. హామీలు అమలు చేయలేనపుడు ఎందుకివ్వాలి? ఈ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అనడం బాధాకరం.

– సుమబిందు, బీఎస్సీ, విడపనకల్లు

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



మాట్లాడుతున్న బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: మెరుగైన సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకంగా ఉంటోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఏపీ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'మహిళ స్నేహపూర్వక గ్రామం-పంచాయతీ థీమ్-9' అంశంపై రెండు రోజుల శిక్షణ తరగతులు అనంతపురంలోని జెడ్పీ క్యాంపస్‌లో ఉన్న డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం ప్రారంభమయ్యాయి. గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత మహిళల భద్రత, సమానత్వం, సమగ్రాభివృద్ధి వైపు ప్రోత్సహించే దిశగా కార్యక్రమాన్ని రూపొందించడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో సానుకూల మార్పుల కోసం పని చేసే దిశగా సమర్థవంతంగా తీర్చిదిద్దడమే శిక్షణ ఉద్దేశమని పేర్కొన్నారు. మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీ కింద జిల్లాలోని ఆరు మండలాల్లో ఒక్క పంచాయతీ చొప్పున మొత్తం ఆరు గ్రామ పంచాయతీలను ఎంపిక చేశామని సీఈఓ శివశంకర్ తెలిపారు. ఇందులో ఆత్మకూరు మండలంలో తోపుదుర్తి, బత్తలపల్లి మండలంలో బత్తలపల్లి, కంబదూరు మండలంలో చెన్నంపల్లి, కనగానపల్లి మండలంలో తగరకుంట, తాడిపత్రి మండలంలో ఊరచింతల, వజ్రకరూరు మండలంలో పాత కడమలకుంట గ్రామాలు ఉన్నాయన్నారు. ఒక్కో పంచాయతీ నుంచి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఏఎన్ఎం, వీఓ లీడర్లు ముగ్గురు చొప్పున ఒక్కో పంచాయతీ నుంచి మొత్తం తొమ్మిది మందిని ఎంపిక చేసి, వారికి రెండ్రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తమ పంచాయతీల్లో అమలయ్యేలా చూడాలని కోరారు.డీడీఓ నాగశివలీల, డీపీఆర్‌సీ శిక్షణ కేంద్రం జిల్లా మేనేజర్ నిర్మల్‌దాస్ పాల్గొన్నారు.

డీసీసీబీలో 'క్యూఆర్ కోడ్' సేవలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)కు సంబంధించి ఇక నుంచి 'క్యూఆర్ కోడ్' సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక డీసీసీబీ హాలులో జరిగిన కార్యక్రమంలో మొదటి క్యూఆర్ కోడ్‌ను రాచానపల్లి సొసైటీకి అందజేశారు. వచ్చే వారం నుంచి అన్ని రకాల వ్యాపార వాణిజ్యాలకు అకౌంట్ కలిగిన అందరికీ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. రైతులకు ప్రాధాన్యత ఇస్తూనే ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా డీసీసీబీ పనిచేస్తుందన్నారు. అంతకు ముందు ఆప్కాబ్ రాష్ట్ర అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, విజయనగరం డీసీసీబీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున డీసీసీబీ చైర్మన్‌తో సమావేశమయ్యారు. సీఈవో కె.సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

15 నుంచి 'గాలికుంటు' టీకాలు

అనంతపురం అగ్రికల్చర్: ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు నెల రోజులు పాటు జరిగే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల పోస్టర్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో జేడీ సుధాకర్, డీడీ రమేష్‌రెడ్డి, ఏడీడీఎల్ ఏడీ రవిబాబు, డీఎల్‌డీఏ ఈవో వెంకటేష్, వీఏఎస్ గోల్డ్స్‌మన్ పాల్గొన్నారు.

కూలిన బతుకులు

- మించిలివారికోట వద్ద ఆటో బోల్తా
- వైఎస్సార్ కడపకు చెందిన ఇద్దరు కూలీల మృతి
- అగ్రహారంలో టమాట కోసేందుకు వచ్చి మృత్యువాత





మృతి చెందిన పట్టా దేవనాథ్, బత్తల హేమలత

తనకల్లు: వారంతా రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు. కూలి కాస్త ఎక్కువగా వస్తుందన్న ఆశతో జిల్లా దాటి వచ్చారు. రోజంతా టమాట తొలగింపు పనుల్లో అలసిపోయారు. సూర్యుడు అస్తమించే వేళ ఆ రోజు అందిన కూలి తీసుకుని స్వగ్రామాలకు ఆటోలో పయనమయ్యారు. ఇంట్లో బిడ్డల గురించి ఒకరు, భార్య ఆరోగ్యం గురించి మరొకరు ఇలా ఆలోచిస్తూ వెళ్తున్నారు. కానీ ఆటో బోల్తా పడగా వారి జీవితాలు అక్కడే ముగిసిపోయాయి. కూలీలతో వెళ్తున్న ఓ ఆటో మండలం పరిధిలోని కొక్కంటి సమీపంలోని మించిలవారికోట రోడ్డు వద్ద బోల్తా పడడంతో వైఎస్సార్ కడప జిల్లా చక్రాయపేట మండలానికి చెందిన వ్యవసాయ కూలీలు పట్టా దేవనాథ్ (45), బత్తల హేమలత (32) మృతి చెందారు.

తిరిగి వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు

వైఎస్సార్ కడప జిల్లా చక్రాయపేట మండలం కొండప్పగారిపల్లి, ఆంజనేయపురం, బురుజుపల్లి గ్రామాలకు చెందిన పలువురు వ్యవసాయ కూలీలు మంగళవారం ఉదయం ఆటోలో శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని అగ్రహారంపల్లికి చెందిన ఓ రైతు పొలంలో టమాట కోసేందుకు వచ్చారు. పని ముగిసిన అనంతరం అదే ఆటోలో స్వగ్రామాలకు బయలుదేరారు. అయితే మించిలివారికోట రోడ్డు వద్దకు రాగానే వేగంగా వెళ్తున్న ఆటో ఒక్కసారిగా అదుపు తప్పడంతో రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బత్తల హేమలతకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అదే ఆటోలో ప్రయాణిస్తున్న బూరుజుపల్లికి చెందిన పట్టా దేవనాథ్, పట్టా బయన్న, శివగంగ, కొండప్పగారిపల్లికి చెందిన పెద్ద గంగులయ్య, బురుజుపల్లికి చెందిన పట్టా బయప్ప, గాయపడ్డారు. విషయం తెలుసుకున్న 'వందేమాతరం టీం' సభ్యులు బాగేపల్లి అశోక్, బాలు, నవీన్, తండేల్ తదితరులు క్షతగాత్రులను తమ ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పుట్టా దేవనాథ్ మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ గోపి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామ సర్పంచ్ సుమారు రూ.కోటి వరకు నిధులు దారి మళ్లించి తన బ్యాంకు ఖాతాలో జమ చేసుకున్నాడు. దీనిపై అదే గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి పలుమార్లు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోలేదు. రాజకీయ నాయకుల ప్రవేశంతో అధికారులు మౌనంగా ఉన్నట్లు తెలిసింది.
- ధర్మవరం మండలం రేగాటిపల్లిలో విశ్వనాథ్‌రెడ్డి అనే రైతు.. డబ్బులు చెల్లించినా ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చేందుకు అధికారులు వెనకడుగు వేశారు. కూటమి పార్టీల నాయకులు చెబితేనే ఇస్తామని హుకుం జారీ చేయడంతో బాధిత రైతు కలెక్టరేట్‌ను ఆశ్రయించారు. అధికారులు ప్రభుత్వ సేవకులా? లేక ఓ రాజకీయ పార్టీకి కొమ్ము కాసేందుకు పని చేస్తున్నారా? అని ప్రశ్నించాడు. ఆ తర్వాత రైతుకు మెటీరియల్ ఇచ్చారు. కానీ జాప్యం చేసిన అధికారిపై చర్యలు లేవు.
- పుట్టపర్తి మండలం పెడపల్లిలో టీడీపీకి చెందిన ఓ కార్యకర్త ప్రభుత్వ భూములను కాజేశాడు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి.. రిజిస్ట్రేషన్ కూడా చేశాడు. తర్వాత భవనం నిర్మించాడు. దీనిపై గ్రామస్తులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై మంత్రి పేషీ నుంచి సబ్ రిజిస్ట్రార్‌కు నోటీసులు వచ్చాయి. భవనం కూల్చేయాలని కలెక్టర్ సూచించారు. అయినా కూల్చివేతపై జాప్యం చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- గోరంట్ల మండలం కరావులపల్లి తండాలోని ఓ కుటుంబానికి చెందిన ఆస్తిని విద్యుత్ శాఖలో పని చేసే ఉద్యోగి కాజేశాడు. అధికారులను అడ్డు పెట్టుకుని సామాన్యులను బెదిరించి రెవెన్యూ రికార్డుల్లో ఆరు ఎకరాల పొలం ఎక్కించుకున్నాడు. దీనిపై బాధితులు గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అయితే విద్యుత్ శాఖలో పని చేసే ఉద్యోగిపై ఇంతవరకూ ఎలాంటి చర్యలూ లేవు.

నేతల ఒత్తిళ్లు.. అధికారుల తప్పిదాలు

- కలెక్టరేట్‌ను ఆశ్రయించాక వెలుగులోకి ఘటనలు
- రిజిస్ట్రేషన్, రెవెన్యూ, విద్యుత్ శాఖలపై ఫిర్యాదులు
- విచారణ తర్వాత ఉన్నతాధికారుల నుంచి నోటీసులు



సాక్షి, పుట్టపర్తి: అధికారాన్ని అడ్డు పెట్టుకుని కూటమి పార్టీల నాయకులు అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలని.. లేనిపక్షంలో బదిలీ ఖాయమని బెదిరిస్తున్నారు. దీంతో బదిలీపై వెళ్లలేక.. ఉన్న చోటే చెప్పినట్టు వింటూ పని చేయలేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. చెప్పినట్లు చేస్తే.. అవతలి వైపు బాధితులు కలెక్టరేట్‌ను ఆశ్రయిస్తున్నారు. జిల్లా అధికారుల విచారణలో బాధితులకు అన్యాయం జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. సంజాయిషీ ఇస్తే ఇరుక్కుంటామని.. ముందుగానే సెలవుపై వెళ్లే అధికారులు కొందరు ఉంటే.. ఉన్నతాధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పి విచారణ నివేదిక కనుమరుగు చేసే వారు మరికొందరు. ఈ రెండూ కాకుండా రాజకీయ నాయకులతో ఒత్తిడి చేయిస్తూ.. తప్పించుకుంటున్న అధికారులు కూడా ఉన్నారు.

నివేదికలు కనుమరుగు

మండల, మున్సిపల్ స్థాయిలో జరిగే అక్రమాలపై బాధితులు కలెక్టరేట్‌ను ఆశ్రయిస్తున్నారు. ఆ తర్వాత విచారణ చేసే అధికారులు నివేదిక సమర్పిస్తున్నారా? లేదా అనేది తెలియడం లేదు. అధికారులు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలుతున్నా.. ఎలాంటి చర్యలూ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వార్డు స్థాయి నుంచి ఆర్డీఓ స్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే అవినీతి, అక్రమాలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులు అర్జీల రూపంలో ఇస్తున్నారు. సమస్య పరిష్కారమైనట్లు మొబైల్‌కు మెసేజీ వస్తున్నా.. తప్పు చేసిన అధికారులపై ఎలాంటి చర్యలూ ఉండటం లేదు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లు బలంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఆ శాఖల్లోనే అధికంగా..

రాజకీయ నాయకుల ఒత్తిళ్ల కారణంగా నిబంధనలకు విరుద్ధంగా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. విద్యుత్, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు, సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీఓ, పంచాయతీ శాఖల పైనే అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయి. స్థానిక అధికారులు అర్హతల ఆధారంగా పని చేస్తే.. కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం ఏముంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం రాజకీయ నాయకుల ఒత్తిళ్లతోనే తమకు అధికారులు పనులు చేయడం లేదని బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. కారణం ఏదైనా నిబంధనలకు విరుద్ధంగా అధికారులు నడుచుకుని తప్పు చేశారని తెలిసిన తర్వాత ఉన్నతాధికారులు నోటీసులు పంపి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.